# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర వ్యాప్తంగా రేపటి నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి.
- ❖ విశాఖపట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సెమీ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడతామని మంత్రి పి.నారాయణ వెల్లడించారు.
- ❖ ప్రజల అవసరాలకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులను విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నామని కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీనివాస్ ఆర్. కటికితాల అన్నారు.
- ❖ కేంద్ర ప్రభుత్వ పథకాలను యువత సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శివరాంప్రసాద్ సూచించారు.

========================

పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి పెట్టుబడులను సమీకరించడం, పట్టణ స్థానిక సంస్థల సామర్థ్యాన్ని పెంపొందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. విశాఖపట్నంలో ఈరోజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ… కేంద్ర ప్రభుత్వ సహకారంతో అర్బన్ ఇన్వెస్ట్మెంట్ విండో (Urban Investment Window) కార్యక్రమం కింద ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళం రాష్ట్రాల ప్రతినిధులతో ప్రాంతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పట్టణాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. జూన్ నెలాఖరు నాటికి సుమారు 2 లక్షల 60 వేల గృహాల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పని చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. విశాఖపట్టణం మెట్రో రైల్ ప్రాజెక్టును మూడు సంవత్సరాల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. విశాఖపట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రాంబిల్లి నుంచి భోగాపురం వరకు సెమీ రింగ్ రోడ్ ను అభివృద్ధి చేస్తామని మంత్రి నారాయణ పేర్కొంటూ…

(వాయిస్ 26 సెకన్లు)

=======================

రాష్ట్ర వ్యాప్తంగా రేపటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు 6 లక్షల 40 వేల 916 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరి కోసం 3 వేల 415 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల 30 నిమిషాలకు ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకు పరీక్ష కొనసాగుతుంది. విద్యార్థులను ఉదయం 8 గంటల 30 నిమిషాల నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సులువుగా చేరుకోవడానికి వీలుగా హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. అలాగే విద్యార్థులు హాల్ టికెట్లను చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

=======================

ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రతి ఏటా జరిగే నిరంతర ప్రక్రియ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, అభ్యంతరాల తొలగింపు ప్రక్రియ జరుగుతూ ఉంటుందన్నారు. విజయవాడలో ఈరోజు ఎస్ఐఆర్‌పై ఏపీ బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కార్యశాల జరిగింది. ఈ సందర్భంగా పి.వి.ఎన్.మాధవ్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన పథకం కాదని తెలిపారు. ఇది 2002 నుండి అమల్లో ఉందని గుర్తు చేశారు. ఈసారి ఆధునిక సాంకేతికత వినియోగించడం వల్ల ఓటర్ల జాబితాలో అనర్హుల తొలగింపు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతోందని పేర్కొన్నారు.

=======================

పట్టణ స్థానిక సంస్థలు ఆర్థిక స్వావలంబన సాధించే విధంగా చర్యలు చేపడుతున్నామని కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి శ్రీనివాస్ ఆర్. కటికితాల పేర్కొన్నారు. విశాఖపట్టణంలో ఈరోజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో వేగంగా పెరుగుతున్న పట్టణీకరణను దృష్టిలో ఉంచుకొని పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులను సమీకరించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులను విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. పట్టణాభివృద్ధి కోసం సంప్రదాయ పద్ధతులతో పాటు.. క్యాపిటల్ మార్కెట్లు, మున్సిపల్ బాండ్లు, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు (REITs) వంటి ప్రత్యామ్నాయ ఆర్థిక వనరులను వినియోగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ దిశగా పట్టణ స్థానిక సంస్థలకు సాంకేతిక, ఆర్థిక మార్గదర్శనం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం Urban Investment Window కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

విరామం

=======================

విశాఖ జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదని జిల్లా సంయుక్త కలెక్టర్ జి. విద్యాధరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం గ్యాస్ రోజువారీ బుకింగ్ కు 18 వేల 184 సిలిండర్లు అవసరం కాగా.. 37 వేల 920 సిలిండర్లు బుకింగ్ కు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు గృహ వినియోగదారులకు గ్యాస్ బుకింగ్స్ లో ప్రాధాన్యత ఇస్తున్నాయని, జిల్లా యంత్రాంగం రోజుకు రెండు సార్లు గ్యాస్ సరఫరా పరిస్థితిని సమీక్షిస్తోందని పేర్కొన్నారు. గృహ వినియోగానికి సరిపడా వంట గ్యాస్ నిల్వలు గ్యాస్ ఏజెన్సీ ల వద్ద అందుబాటులో ఉన్నాయని, గ్యాస్ లభ్యత కోసం ప్రజలు ఆందోళ చెందనవసరం లేదని స్పష్టం చేశారు.

=======================

కేంద్ర ప్రభుత్వ పథకాలను యువత సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శివరాంప్రసాద్ సూచించారు. తిరుపతిలోని హస్తకళారామంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో చేతివృత్తి కళాకారులు తయారు చేసిన వివిధ ఉత్పత్తులతో

ఏర్పాటైన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఏ విధంగా ధరఖాస్తు చేసుకోవాలో ప్రజలకు తెలియజేశామన్నారు. ఎంఎస్ఎంఇల ద్వారా రుణాలు అందించడం వంటి సమాచారాన్ని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వివరించామని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

========================

రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. భీమవరంలో కలెక్టర్ ఈరోజు గాలికుంటు వ్యాధి నివారణ టీకా ప్రచార గోడపత్రికను పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నేటి నుండి నెల రోజుల పాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ వ్యాధి కారణంగా చిన్న దూడలలో మరణాలు సంభవించే అవకాశం ఉందని, పెద్ద పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని తెలిపారు.

========================

నైరుతి బంగాళాఖాతం నుండి కొమొరియన్ ప్రాంతం వరకు మన్నార్ గల్ఫ్ మీదుగా ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, దక్షిణ దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో రేపు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించారు.

========================
========================